సాక్షి నిర్మల్

బుధవారం । 2 । అక్టోబర్ । 2024



బాసరకు నవరాత్రి శోభ

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం శారదీయ నవరాత్రి వేడుకలకు ముస్తాబైంది. గురువారం నుంచి ఈనెల 12 వరకు ఉత్సవాలు జరుగుతాయి. 10లో▸



మంత్రికి ఆహ్వానం

బాసర : బాసర శ్రీజ్ఞానసరస్వతి ఆలయంలో గురువారం నుంచి నిర్వహించే శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను ఆలయ ఈవో విజయరామారావు, ప్రధాన అర్చకులు ఆహ్వానించారు.

గరిష్టం/కనిష్టం
34.2 /25.5

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ పోటీలకు జిల్లా క్రీడాకారులు



బొడిగె శేశాంక్ మమత మల్లీశ్వరి

నిర్మల్‌టౌన్: గత నెల 14 నుంచి 16 వరకు జిల్లా కేంద్రంలో 5వ జూనియర్ బాల, బాలికల బేస్‌బాల్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. నిర్మల్ జిల్లాను బాలుర తరఫున ఆడిన బొడిగె శేశాంక్, బాలికల విభాగంలో ఆడిన జామ్ సోషల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థిని మమత, సోఫీనగర్ కేజీబీవీ విద్యార్థిని మల్లేశ్వరి ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కత్తి కళ్యాణి, సభ్యులు జమున, భూమన్న, అన్నపూర్ణ, శ్రీనివాస్, ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు కేంద్రంగా నిర్వహిస్తున్న అండర్-14, అండర్-17 జోనల్‌స్థాయి క్రీడల్లో ఆశ్రమ పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు తుకారం తెలిపారు. అండర్- 17 కబడ్డీలో బి.గౌతమి, కె.సోని, బి.నందిని, ఖోఖో పోటీల్లో జి.చెంచులక్ష్మి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఎం.రాంజీ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

నిర్మల్ రూరల్: డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జిల్లాలో బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మంగళవారం నుంచి ప్రారంభం కావలసిన ఈ ప్రక్రియ.. రాష్ట్ర అధికారుల నుంచి మెరిట్ జాబితా ఆలస్యంగా రావడంతో ఒకరోజు ఆలస్యంగా ప్రారంభం కానుంది జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. 1:3 పద్ధతిలో అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నారు. ఇప్పటికే అర్హులైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించారు. హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతోపాటు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ చేయించాలని డీఈవో రవీందర్ రెడ్డి సూచించారు.

పకడ్బందీగా చేపట్టాలి..

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. పరిశీలన బృందాలకు సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. మొత్తం 12 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థుల స్థానికత, విద్యార్హత ధ్రువపత్రాలు పరిశీలన చేయడంలో వివిధ అంశాల గురించి వివరించారు. ప్రభుత్వం అందించిన విధివిధానాలకు అనుగుణంగా పరిశీలన చేయాలని సూచించారు. ఇందులో ఏసీజీ పద్మ, సెక్టోరియల్ అధికారులు రాజేశ్వర్, ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, నర్సయ్య, సూపరింటెండెంట్ రమణ, సురేందర్, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



సబ్‌స్టేషన్‌లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు వర్సిటీ ఆవరణలోని సబ్‌స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. విద్యుత్ వ్యవస్థలు, సబ్‌స్టేషన్ కార్యకలాపాలపై అక్కడి సిబ్బందిని కలిసి మాట్లాడారు. తరగతి గదిలో నేర్చుకుంటున్న అంశాల ఆధారంగా సబ్‌స్టేషన్ పనితీరును తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్‌లో సాంకేతికలోపం తలెత్తితే ఎలా మరమ్మతులు చేస్తారో అడిగి తెలుసుకున్నారు. లో, హై వోల్టేజీ వచ్చిన సమయంలో అక్కడి ట్రాన్స్‌ఫార్మర్లను ఎలా సరిచేస్తారు, ఎలా బయటకు పంపుతారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ బావుసింగ్, లక్ష్మణ్, ముత్యం, రాకేశ్, వినయ్ తోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నిడ్రా.. ఏది నిజం..!



జిల్లా కేంద్రంలోని గొలుసుకట్టు చెరువులు

- హైడ్రా వచ్చేస్తోందంటూ ప్రచారం
- ఆక్రమణల పేరుతో పలు సర్వే నంబర్లు వైరల్
- లేక్ కమిటీ సభ్యులతో కలెక్టర్ భేటీ
- ఆక్రమణల లెక్క తేల్చే పనిలో కమిటీ

నిర్మల్: జిల్లాలో హైడ్రా వచ్చేసిందట.. ఇక్కడ నిడ్రా పేరిట ఆక్రమణలను తొలగిస్తారట.. ఇప్పటికే పలు చెరువుల్లో సర్వే నంబర్లతో సహా ఆక్రమణలను కూడా గుర్తించారట.. అంటూ జిల్లాలో జోరుగా ప్రచారం సాగుతోంది. వాట్సప్ గ్రూపులలో ఈ వివరాలతో ఏకంగా ఓ రిపోర్టునే వైరల్ చేస్తున్నారు. తాజాగా జిల్లా అధికారులు సర్వే చేసినట్లుగా చెరువుల ఎఫ్‌టీఎల్(ఫుల్‌ట్యాంక్ లెవల్), బఫర్ జోన్‌లు, వాటి పరిధిలోని పలు సర్వేనంబర్లు అంటూ ప్రచారం చేసేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా హైడ్రాపై జోరుగా చర్చ జరుగుతున్న తరుణంలో జిల్లాలోనూ ఇదే చర్చనీయాంశమైంది. జిల్లా అధికారులు మాత్రం ఇప్పటివరకు దీనిపై ఎలాంటి అధికారికంగా రిపోర్టు తయారు చేయలేదని స్పష్టం చేస్తున్నారు. ఫేక్ రిపోర్టులను నమ్మవద్దని చెబుతున్నారు. గతంలో హైకోర్టు కేసుల సందర్భంగా ఇచ్చిన రిపోర్టులనే మార్చి, సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. మరోవైపు కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం లేక్ ప్రొటెక్షన్ కమిటీతో భేటీ అయ్యారు. నిడ్రాపై స్పష్టతనివ్వకున్నా.. చెరువుల ఆక్రమణల లెక్క తేల్చాలని సూచించడం చర్చనీయాంశమైంది.

హైడ్రా వచ్చేస్తోందంటూ..

హైదరాబాద్‌ను గడగడలాడిస్తున్న హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) రాష్ట్రవ్యాప్తంగా సెగలు పుట్టిస్తోంది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రస్తుతం ఇదే చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోనూ విపరీతంగా చెరువులు, కందకాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు ఉండటంతో ఇక్కడ కూడా హైడ్రాపై చర్చలు కొనసాగుతుండటంతోపాటు జోరుగా ప్రచారమూ చేసేస్తున్నారు. ఇప్పటికే సంబంధిత అధికారులు చెరువులు, ప్రభుత్వ భూములను సర్వే చేయించారని, ఆక్రమణలనూ గుర్తించారని పోస్టులు పెడుతున్నారు. రేపోమాపో జిల్లా అధికారులు నిడ్రా(నిర్మల్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) పేరిట చర్యలు చేపడతారని, ఆక్రమణలన్నింటినీ తొలగించేస్తారంటూ వైరల్ చేస్తున్నారు. ఇందులో ఏది నిజం.. ఏది అబద్ధం.. అనే ఆలోచన చేయకుండా చాలామంది వాటిని షేర్ చేస్తున్నారు.

కోర్టులకు ఇచ్చిన రిపోర్టులను..

జిల్లాకేంద్రంలోని గొలుసుకట్టు చెరువుల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లలో ఈ సర్వే నంబర్లు వస్తాయంటూ జాబితాను ప్రచారం చేస్తున్నారు. ఈ జాబితాలోని చెరువులు, వాటిల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ ఏరియాలు వాస్తవానికి కొంత దగ్గరగా ఉండటంతో ఇది తాజా రిపోర్టుగా భావిస్తున్నారు. కానీ.. ప్రస్తుతం వైరల్ అవుతున్న సదరు రిపోర్టులో 2020లో గొలుసుకట్టు చెరువుల ఆక్రమణలపై వేసిన పిల్‌లో హైకోర్టుకు సమర్పించిన వాటిలో నుంచి కొంత తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

చర్యలెప్పుడో..!?

హైడ్రానో.. నిడ్రానో.. ఏదో ఒకటి చెరువులను కాపాడేందుకు వెంటనే ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మాత్రం జిల్లాలో పెరుగుతోంది. ఎప్పుడో కాకతీయులు, నిమ్మరాజుల కాలంలో తవ్వించిన చెరువులు ఇప్పటికీ చెక్కుచెదరకుండా నీటి అవసరాలను తీరుస్తున్నాయి. ఇలాంటి జలసంపదను రియల్ ఎస్టేట్ పేరిట చెరబడుతున్న తీరుపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రధానంగా జిల్లాకేంద్రంలో విలువైన గొలుసుకట్టు చెరువులతోపాటు కందకాలు, నాళాల ఆక్రమణలపై ఉన్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ సమావేశం..

ఇదిలా ఉంటే.. కలెక్టర్ అభిలాష అభినవ్ లేక్ కమిటీతో కలెక్టరేట్‌లో మంగళవారం భేటీ అయ్యారు. ఇందులో ఇప్పటికే కమిటీ సభ్యుల వద్ద ఉన్న ఫిర్యాదులు, ఆక్రమణలను పరిశీలించినట్లు సమాచారం. అనంతరం జిల్లాలోని చెరువుల్లో ఉన్న ఆక్రమణలను అంచనా వేయాలని సూచించినట్లు తెలిసింది. ఈమేరకు త్వరలోనే జిల్లా అధికారులు చెరువులో కబ్జాలపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వనున్నారు.

అవాస్తవాలను నమ్మవద్దు..

జిల్లాలో చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లేక్ ప్రొటెక్షన్ కమిటీ పనిచేస్తోంది. చెరువుల ఆక్రమణలు, సర్వే నంబర్లు అంటూ సోషల్‌మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారాలను మాత్రం నమ్మవద్దు.

–లక్ష్మి, ఈఈ, ఇరిగేషన్

అవార్డుల ఆసుపత్రులు

- ఉత్తమ పీహెచ్‌సీగా మామడ ఆరోగ్య కేంద్రం
- ఉత్తమ అర్బన్ హెల్త్‌సెంటర్‌గా రాంనగర్ యూహెచ్‌సీ
- ఉత్తమ ప్రాథమిక ఉపకేంద్రంగా గొడిసెరా
- మరో 9 ఆరోగ్య కేంద్రాలకు ప్రోత్సాహక బహుమతులు

జిల్లాకు కాయకల్ప అవార్డు కింద వచ్చిన నగదు వివరాలు....
మొత్తం జిల్లాకు వచ్చిన నగదు రూ.11.60 లక్షలు
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.6.50 లక్షలు
అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.2.50 లక్షలు
ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ.2.60 లక్షలు



అవార్డుకు ఎంపికైన మామడ పీహెచ్‌సీ

ఉత్తమ పీహెచ్‌సీగా..

రాష్ట్రంలో ఉత్తమ సేవలందిస్తున్న పీహెచ్‌సీలకు సైతం అవార్డులను ప్రకటించారు. ఈ విభాగంలో 92 శాతం మార్కులతో మామడ పీహెచ్‌సీ ప్రథమ స్థానంలో నిలిచింది. రూ.2 లక్షల నగదు బహుమతి, సర్టిఫికెట్ అందజేయనున్నారు. జిల్లాలోని మహాగావ్ 89, దస్తురాబాద్ 83, కుభీర్ 86, వెల్మల్ బొప్పారం 89, సాన్ 86, దిలావర్‌పూర్ 82, ముజ్గి 80, కడెం 78, పెంబి 77 మార్కులతో ప్రోత్సాహక బహుమతులు దక్కించుకున్నాయి. ప్రోత్సాహక బహుమతులు దక్కించుకున్న ఈ పీహెచ్‌సీలకు రూ.50 వేల నగదు పురస్కారం అందజేయనున్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ఆరోగ్యశాఖ అందించే కాయకల్ప అవార్డుల్లో జిల్లా పంట పండింది. ఏకంగా 10 పీహెచ్‌సీలు, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, ఆరు సబ్ సెంటర్లకు అవార్డులు దక్కాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్వచ్ఛతను పెంచేందుకు కేంద్రం 2015 నుంచి కాలకల్ప అవార్డులు ప్రకటిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఆస్పత్రుల పనితీరును బట్టి కాయకల్ప అవార్డు కింద ఏటా ప్రథమ, ద్వితీయ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి బహుమతి సాధించిన జిల్లా ఆస్పత్రులకు రూ.50 లక్షలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు రూ.15 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, అర్బన్ హెల్త్ సెంటర్లకు రూ.2 లక్షలు, సబ్ సెంటర్లకు రూ.లక్ష చొప్పున నగదు పురస్కారం అందజేస్తుంది. స్వచ్ఛభారత్ అభియాన్, నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 2023-24కి సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై వైద్య ఆరోగ్యశాఖ అవార్డు ఫలితాలను విడుదల చేసింది. ఆస్పత్రులో శుభ్రత, శానిటేషన్, రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్న ఆస్పత్రులను ఈ అవార్డు కింద ఎంపిక చేశారు. ఈఏడాది జిల్లాలో పలు ఆరోగ్య కేంద్రాలు ఈ అవార్డుకు ఎంపికయ్యాయి.

ఉత్తమ అర్బన్ హెల్త్ సెంటర్‌గా రాంనగర్...

ఉత్తమ అర్బన్ హెల్త్ సెంటర్‌గా జిల్లా కేంద్రంలోని రాంనగర్ అర్బన్ సెంటర్ 85 శాతం మార్కులతో ప్రథమ స్థానం పొందింది. ఈ అర్బన్ హెల్త్ సెంటర్‌కు రూ.2 లక్షల నగదు పురస్కారం అందనుంది. ప్రోత్సాహక బహుమతిగా బంగల్‌పేట్ అర్బన్ హెల్త్ సెంటర్ 82, మార్కులతో రూ.50 వేల నగదు పురస్కారానికి ఎంపికయింది.

ఉత్తమ ఉపకేంద్రంగా గొడిసెరా...

ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపకేంద్రంగా గొడిసెరా హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌కు రూ.లక్ష ఇవ్వగా, బిలోలి హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఫస్ట్ రన్నరప్‌గా 50 వేలు, సెకండ్ రన్నరప్‌గా కామోల్ సెంటర్‌కు రూ.35 వేలు, ప్రోత్సాహక బహుమతుల కింద అష్టా, మల్లాపూర్, చించోలిబి వెల్‌నెస్ సెంటర్లకు రూ.25 వేల చొప్పున ప్రకటించింది. త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేస్తారు.

నిధుల వినియోగం ఇలా...

ఆస్పత్రుల్లో పచ్చదనంతోపాటు పరిశుభ్రతను పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించినందుకు జిల్లాలోని 10 పీహెచ్‌సీలు, రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, 6 ఆరోగ్య ఉప కేంద్రాలకు రూ.11.60 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో 75 శాతం నిధులను ఆస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన, గార్డెనింగ్, పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించడానికి వినియోగిస్తారు. మిగతా 25 శాతం నిధులను ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఇతరులకు ప్రోత్సాహకంగా అందించనున్నారు.

సంతోషంగా ఉంది.



కాయకల్ప అవార్డుకు జిల్లా ఆస్పత్రులు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు, వసతులు కల్పిస్తున్నాం. కాయకల్ప కింద వచ్చే నగదుతో ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు ఇంకా మెరుగు పడనున్నాయి. వచ్చే ఏడాది అన్ని ఆస్పత్రులకు అవార్డులు వచ్చేలా కృషి చేస్తాం.

– డాక్టర్ రాజేందర్, డీఎంహెచ్‌వో

పకడ్బందీగా డిజిటల్ కార్డుల సర్వే



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: డిజిటల్ కార్డుల జారీకి నిర్వహించే సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. సీఎస్ శాంతికుమారితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పైలెట్ ప్రాజెక్టుపై దిశానిర్దేశం చేశారు. 119 నియోజకవర్గాల్లోని ఏదైనా ఒక ఊరు లేదా మునిసిపాలిటీలోని ఒక వార్డుని ఎంచుకుని రోజుకు 30 నుంచి 40 ఇళ్లు ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు సర్వే చేయాలని సూచిచారు. సర్వేలో భాగంగా ప్రతీ ఇంట్లోని ప్రతీ కుటుంబ సభ్యుని వివరాలు సేకరించాలన్నారు. ఒక కుటుంబానికి 10 అంకెలతో కూడిన ఐడెంటిటీ నంబర్, కుటుంబంలోని ఒక్కో సభ్యునికి 11 అంకెలతో కూడిన ఐడెంటిటీ నంబర్ కేటాయించాలన్నారు. పొరపాట్లు జరగకుండా సర్వే నిర్వహించాలన్నారు. ప్రాజెక్టుకి నోడల్ ఆఫీసర్‌గా అడిషనల్ కలెక్టర్‌స్థాయి అధికారి వ్యవహరిస్తారన్నారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ డిజిటల్ కార్డుల అమలు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన సేవలు అందించాలి

- నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి
- ఎస్పీ జానకీషర్మిల



సమీక్షలో ఎస్పీ జానకీషర్మిల, ఏఎస్పీ అవినాష్, పోలీస్ అధికారులు

నిర్మల్‌టౌన్: పోలీసులు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నేర సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణకు మరింత సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సూచించారు. దిలావర్‌పూర్ గంగనీళ్ల జాతర, బాసరలో మూలా నక్షత్ర పూజలు, మహా అక్షరాభ్యాసం వంటి వేడుకల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గంజాయి కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్లు, ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులు, దొంగతనాలు, మహిళలపై జరుగు నేరాలపై, అధికారుల వద్ద ఉన్న ఎంక్వయిరీ రిపోర్టులపై చర్చించారు. పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణా, మట్కా ఇతర నిషేధిత కార్యకలాపాలు జరగకుండా చూడాలన్నారు. చోరీల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. సోషల్ మీడియాపై నిఘా ఉంచాలన్నారు. మతాల మధ్య చిచ్చురేపే, సామాజికవర్గాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, ఎస్‌బీ, ఐటీకోర్, కమ్యూనికేషన్, డీసీఆర్బీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ మైదానం నుంచి పెన్షనర్స్ భవన్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు. తల్లి దండ్రులు, వయోవృద్ధులను నిర్లక్ష్యం చేయొద్దని, వారిని ప్రేమగా, ఆప్యాయతతో చూసుకోవాలని సూచించారు. వృద్ధులకు నష్టం జరిగినా, నిరాధరణకుగురైనా అధికారులను సంప్రదించాలన్నారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకడ్రైవ్ చేపట్టి స్థిర, చర, రక్షణ, మెయింటనెన్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం వృద్ధులను సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షుడు ఎంసీ.లింగన్న, సీడీపీవోలు, రిటైర్డ్ ఉద్యోగులు, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు 'కిశోర గాంధీయం' పుస్తకావిష్కరణ

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకు చెందిన కవి, విశ్రాంత ఎంపీడీవో చట్ల గజ్జరాం రచించిన 'కిశోర గాంధీయం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లోని లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు 'నిర్మల భారతి' సాహితీ క్షేత్రం అధ్యక్షుడు తొడిశెట్టి పరమేశ్వర్ తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ కవి, రచయిత తిరునగరి సురేశ్‌ఖర్, జిల్లా కవులు డాక్టర్ అప్పాల చక్రధారి, బొందిడి పురుషోత్తం, దామెర రాములు, ఉప్పు కృష్ణంరాజు హాజరవుతారని వివరించారు.

ఆఖరి ప్రయాణం

- అర్ధరాత్రి అదుపు తప్పిన కారు
- ఐదుగురిని బలిగొన్న రహదారి ప్రమాదం
- మృతులందరిదీ ఒకే కుటుంబం
- ఆదిలాబాద్ జిల్లా మేకలగండి వద్ద ఘటన

ఖురాన్ కోర్సు పూర్తి చేసుకున్న బిడ్డను చూసిన సంబురం ఆ కుటుంబ సభ్యుల్లో ఎంతోసేపు నిలువలేదు. కొడుకుకు అందిన సత్కారం ఆనవాళ్లు ఇంటికి చేరకముందే వారంతా తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. మరో పది నిమిషాల్లో గమ్యం చేరాల్సి ఉండగా రహదారిపై మాటు వేసిన మృత్యువు ఐదుగురిని కబళించింది. అదే వారికి ఆఖరు ప్రయాణమైంది.



మహ్మద్ ఉస్మానొద్దీన్ (ఫైల్) | సయ్యద్ మహ్మద్ అలీ (ఫైల్) | ఖాజా మోయినొద్దీన్ (ఫైల్) | మహ్మద్ ఫరీదొద్దీన్ (ఫైల్) | సయ్యద్ మోయిజొద్దీన్ మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్/గుడిహత్నూర్: తమ కుమారుడు హాఫిజే ఖురాన్ కోర్సు పూర్తి చేసుకోవడంతో వారి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ఆ మురిపం తీరకముందే ఆ కుటుంబానికి చెందిన ఐదుగురు మృత్యు ఒడికి చేరారు. కొద్ది నెలల క్రితం 14 ఏళ్ల ఆ బాలుడిని కుటుంబీకులు భైంసాలోని దారుల్-ఉలుమ్‌లో చేర్పించారు. కోర్సు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం రాత్రి అక్కడ నిర్వహించిన కార్యక్రమానికి కుటుంబ సభ్యులు హాజరయ్యారు. బాలుడికి ఘన సత్కారం అనంతరం అక్కడ ప్రార్థనలు నిర్వహించి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా ఘోర రోడ్డు ప్రమాదం వారిని తిరిగిరాని లోకాలకు చేర్చింది. అర్ధరాత్రి అంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో వాహనం అదుపుతప్పింది. ఘటనా స్థలంలోనే నలుగురు మృతి చెందగా.. మరొకరు రిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. విషయం తెలియడంతో కుటుంబీకులు, బంధువులు పెద్ద ఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. వారు రోధించిన తీరు అందరిని కంటతడి పెట్టించింది.

గాలిలో కలిసిన ఐదుగురి ప్రాణాలు..

ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మహ్మద్ ఫరీదొద్దీన్(14) ఖురాన్ హాఫీజ్ కోర్సును భైంసాలో పూర్తి చేసుకోగా ఆ బాలుడిని అక్కడ సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ నుంచి కారులో ఏడుగురు కుటుంబీకులు సోమవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో బయల్దేరి వెళ్లారు. కార్యక్రమం అనంతరం రాత్రి 9.15 గంటలకు తిరుగు ప్రయాణం అయ్యారు. ఏడుగురితో పాటు ఆ బాలుడిని సైతం వారితోనే తీసుకొస్తున్నారు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద రాత్రి 11గంటల సమయంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న సయ్యద్ మోయిజొద్దీన్ (67), అతడి అల్లుడు ఖాజా మోయినొద్దీన్ (43)తోపాటు ఖాజా కుమారుడు ఉస్మానొద్దీన్(8)తో పాటు మోయిజొద్దీన్ కొడుకు కుమారుడు మహ్మద్ అలీ(5) ఘటనా స్థలంలోనే మరణించారు. ఖాజా మరో కుమారుడు, సత్కార గ్రహీత ఫరీదొద్దీన్(14) రిమ్స్‌లో చికిత్స పొందుతూ చనిపోయాడు. తీవ్ర గాయాల పాలైన మోయినొద్దీన్ భార్య ఆయేషా, కూతురు ఇఖ్రా, కొడుకు సాద్ ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. మోయిజొద్దీన్ విద్యుత్ శాఖలో ఫోర్‌మెన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాడు. ఆయన అల్లుడు ఖాజా మోయినొద్దీన్ విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య ఆయేషాతోపాటు ముగ్గురు కుమారులు ఫరీదొద్దీన్, ఉస్మానొద్దీన్, సాద్, కుమార్తె ఇఖ్రా సంతానం. పెద్ద కుమారుడు ఫరీదొద్దీన్ ఖురాన్ హాఫీజ్ కోర్సు పూర్తి చేయగా ఇద్దరు కుమారులు ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నారు. వీరితోపాటు సయ్యద్ మోయిజొద్దీన్ మనవడు అస్లమ్ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు.

ఒకేసారి ఐదుగురి అంతిమయాత్ర..

టీచర్స్ కాలనీ నుంచి ఒకేసారి ఐదుగురి అంతిమయాత్రను ఈద్గా మైదానం వరకు నిర్వహించారు. కుటుంబీకులు, బంధువులు, స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ఇంటికి తరలించారు. అక్కడి నుంచి అంతిమయాత్ర మొదలైంది. ఈద్గాలోని ఖబరస్తాన్‌లో వరుస క్రమంలో ఖననం చేశారు.


ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ..

ప్రమాద స్థలాన్ని ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. డేంజర్‌స్పాట్స్‌ను గుర్తించి నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు. ఆయన వెంట ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇంద్రవెల్లి ఎస్సై సునీల్ తదితరులున్నారు.

అతివేగమే కారణం..

వాహనాన్ని సయ్యద్ మోయిజొద్దీన్ డ్రైవింగ్ చేస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్దకు చేరుకున్న సమయంలో వాహనం వేగంతో ఉండడంతో ఒక్కసారిగా అదుపు తప్పింది. డివైడర్లను ఢీకొట్టి బోల్తా పడింది. నలుగురు ఘటనా స్థలంలో, మరొకరు ఆసుపత్రిలో మృతి చెందారు.

ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా ఇలంబరితి



సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా రవాణా శాఖ కమిషనర్, ఐఏ ఎస్ ఇలంబరితిని నియమిస్తూ సీఎస్ శాంతికుమారి నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయా జిల్లాల్లో పర్యటించడంతో పాటు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలును పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాలకు ఇలంబరితిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. ఇదిలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలంబరితి జెడ్పీ సీఈవోగా విధులు నిర్వహించారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత నిర్మల్ తొలి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

క్లుప్తంగా

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి


మచ్చ గంగన్న (ఫైల్)

తాంసి: తాంసి పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ మచ్చ గంగన్న(58) విధి నిర్వహణలో ఉండగానే గుండెపోటుతో మంగళవారం మృతిచెందాడు. జైనథ్ మండలం బెల్గాం గ్రామానికి చెందిన గంగన్న ఐదేళ్లుగా హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఆవరణలోని క్వార్టర్స్‌లో ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఒక్కసారిగా గుండెపోటుకు గురై తోటి పోలీసుల ముందే కుప్పకూలిపోయాడు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, గంగన్న కుమారుడు చిరంజీవి సైతం తాంసి పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కుమారుడి కళ్లేదుట తండ్రి గంగన్న మృతిచెందాడు. సొంత గ్రామమైన బెల్గాం గ్రామంలో సాయంత్రం నిర్వహించిన అంత్యక్రియల్లో ఎస్సై శివరాంతోపాటు జిల్లా పోలీస్ అధికారులు పాల్గొని నివాళి అర్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

లక్సెట్టిపేట: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన సత్తయ్య (45), శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పై మంగళవారం వెంకట్రావుపేటకు వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో వెనుక కూర్చున్న సత్తయ్య కిందపడ్డాడు. ఆయన తలకు తీవ్రగాయం కావడంతో శ్రీనివాస్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందాడు. అదనపు ఎస్సై రామయ్య మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. భార్య రాజేశ్వరి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కోటపల్లి: మండలంలోని దేవులవాడ సమీపంలోని ప్రాణహితనది తీరంలో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభించింది. స్థానికులు గుర్తించి ఎస్సై రాజేందర్‌కు సమాచారం అందించారు. ఎస్సై అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. 35 ఏళ్ల వయస్సు ఉన్న మహిళగా గుర్తించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

డీజే డబ్బుల విషయంలో గొడవ

ఆదిలాబాద్‌టౌన్: డీజే డబ్బుల విషయంలో మాటమాట పెరిగి గొడవకు దారితీసిన సంఘటన స్థానికంగా చోటు చేసుకుంది. స్థానికులు, టుటౌన్ పోలీసుల వివరాల ప్రకారం..గణేశ్ నవరాత్రి నిమజ్జనోత్సవంలో భాగంగా దస్నాపూర్‌కు చెందిన ఓ డీజే నిర్వాహకుడు మహాలక్ష్మి కాలనీకి చెందిన గణేశ్ మండపం నిర్వాహకులకు డీజేను ఏర్పాటు చేశాడు. ఇందుకు రూ.30 వేలు అద్దెకు మాట్లాడుకోగా, అడ్వాన్స్‌గా రూ.5 వేలు అందించారు. మిగతా రూ.25 వేల కోసం డీజే యజమాని నిర్వాహకులకు ఫోన్ చేయగా రైల్వేస్టేషన్ వద్దకు రా మాట్లాడుదామని పిలిచారు. డీజే నిర్వాహకుడు అక్కడికి చేరుకున్నాడు. ఇరుపక్షాలు మాట్లాడుకుంటూ ఉండగా మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దీంతో రైల్వేస్టేషన్‌లో ఉద్రిక్తత నెలకొంది. అక్కడే ఉన్న రైల్వే పోలీసులు వారికి నచ్చజెప్పినా వినిపించుకోలేదు. స్థానికుల సమాచారంతో సీఐ కరుణాకర్‌రావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను అక్కడి నుంచి చెదరగొట్టారు.

బాసరకు నవరాత్రి శోభ


స్వాగత తోరణం

- రేపటి నుంచి శారదీయ శరన్నవరాత్రులు
- ఆలయం చుట్టూ విద్యుత్ కాంతులు
- ప్రధాన ద్వారం వద్ద స్వాగతతోరణాలు..


విద్యుద్దీపాల వెలుగులో బాసర ఆలయం

భైంసా/బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం శారదీయ నవరాత్రి వేడుకలకు ముస్తాబైంది. గురువారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 12 వరకు జరుగనున్నాయి. ఈమేరకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఏటా దసరా ఉత్సవాల సందర్భంగా లక్షల మంది భక్తులు వస్తారు. ఈసారి కూడా భారీగా భక్తులు వస్తారన్న అంచనాతో ఈవో విజయరామారావు సిబ్బందితో ఏర్పాట్లు చేయిస్తున్నారు. బాసర ఉత్సవాలపై భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ ప్రత్యేక దృష్టిసారించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష చేస్తున్నారు.

ప్రముఖులకు ఆహ్వానం...

నవరాత్రి ఉత్సవాల్లో బాసర ఆలయానికి రావాలని పలువురు ప్రముఖులకు ఈవో విజయరామారావు, ఆలయ అర్చకులు, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతోపాటు దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్, ఎస్పీ, ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి ఆహ్వానించారు.

కాంతులీనుతున్న ఆలయం...

ఉత్సవాల నేపథ్యంలో బాసర ఆలయం విద్యుత్ వెలుగులతో కాంతులీనుతోంది. ఆలయ గోపురాలు, ప్రధాన గుడి, అంతరాలయం, మహంకాళి ఆలయం ఇలా అన్నిచోట్ల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. క్యూలైన్‌ను ఆనుకుని ఉన్న ఆలయ ప్రాంగణంలో గార్డెన్‌లో పెరిగిన చెట్లకు విద్యుత్ దీపాలు అమర్చారు. రంగురంగుల విద్యుత్ వెలుగుల్లో ఆలయం సరికొత్తగా కనిపిస్తోంది. ప్రధాన ద్వారాన్ని కూడా అందంగా అలంకరించారు. టీటీడీ సత్రం నుంచి రోడ్డు మార్గంలో విద్యుత్ దీపాలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

అన్నిచోట్ల ఏర్పాట్లు...

పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాటుచేసినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ప్రసాదాల కౌంటర్ వద్ద అక్షరాభ్యాస మండపాల వద్ద ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

నిత్యాన్నదానం...

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో ఉచిత అన్నదానం జరుగుతుంది. నాందేడ్‌కు చెందిన బాబాజీ జగదీశ్‌మహారాజ్ గాడిపుర, బాసర ఆలయం ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

దీక్షలకు ఏర్పాట్లు...

నవరాత్రి ఉత్సవాల్లో వందలాది భక్తులు అమ్మవారి దీక్షలు స్వీకరిస్తుంటారు. తెల్లవస్త్రాలు ధరించి పాదరక్షలు లేకుండా కఠికనేలపై నిద్రిస్తూ ఉపవాస దీక్షలు చేస్తారు. దీక్షాపరుల కోసం ఈయేడు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రోజుకో రూపంలో...

బాసర సరస్వతీ అమ్మవారు తొమ్మిది రోజుల పాటు రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మొదటి రోజు శైలపుత్రి అలంకారంతో, రెండోరోజు బ్రహ్మచారిణి అలంకారంలో, మూడోరోజు చంద్రఘంట అలంకారంలో, నాలుగో రోజు కూష్మాండ అలంకారంలో, ఐదోరోజు స్కందమాత అలంకరణలో, ఆరో రోజు కాత్యాయిని అలంకారంలో, ఏడోరోజు కాళరాత్రి అలంకారంలో, ఎనిమిదో రోజు మహాగౌరి అలంకారంలో, తొమ్మిదివ రోజు సిద్ధిధాత్రి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారికి ప్రతీరోజు వేర్వేరుగా నైవేద్యాలు సమర్పిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి. ఈమేరకు ఏర్పాట్లు చేశాం. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– విజయరామారావు, ఆలయ ఈవో

ఎడారిలో క్యామెల్ లైఫ్..!

- కువైట్ తీసుకెళ్లి.. సౌదీలోని ఎడారిలో ఒంటెల కాపరి చేశారు
- సెల్ఫీవీడియోలో సీఎం రేవంత్‌కు నిర్మల్ జిల్లా వాసి మొర
- స్వదేశానికి రప్పించిన ప్రభుత్వం


కుటుంబసభ్యులతో నామ్‌దేవ్ రాథోడ్

శంషాబాద్: గోట్‌లైఫ్ సినిమా తలపించేలా జరిగిన మరో యదార్థ సంఘటన చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువి గ్రామవాసి నామ్‌దేవ్ రాథోడ్.. కువైట్‌లో హౌస్ కీపింగ్ పనికోసం ఏజెంట్ తీసుకెళ్లి..ఆ దేశం బార్డర్‌ను దాటించి సౌదీలోని ఎడారిలో ఒంటెల కాపరిని చేశారు. దీనిపై ఆయన సెల్ఫీ వీడియోలో సీఎం రేవంత్‌రెడ్డికి మొరపెట్టుకున్నాడు. స్వదేశానికి రప్పించాలని వేడుకున్నాడు. ప్రభుత్వం విదేశీ వ్యవహారాల శాఖతో సంప్రదించి కువైట్, సౌదీలో ఎంబీసీలను అప్రమత్తం చేశాయి. ఎట్టకేలకు ఆయన మంగళవారం ఉదయం రియాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. ఈ సందర్భంగా నామ్‌దేవ్ రాథోడ్ మీడియాతో మాట్లాడుతూ కువైట్‌లో నెలరోజులు తర్వాత తనను అక్రమంగా సౌదీలోని ఎడారికి తీసుకెళ్లారని వాపోయాడు. అక్కడ ఒంటెలను మేపడంతోపాటు వాటికి సంబంధించిన పనులను చేయించుకున్నారు. తీవ్ర ఎండలో అవస్థలు పడ్డానని తెలిపాడు. యజమాని తీవ్ర చిత్రహింసలకు గురిచేయడంతో సెల్ఫీ వీడియో తీసి భార్యకు పంపించినట్లు తెలిపాడు. ఆ తర్వాత ఆమె వేరే వారికి పంపింది. కొన్నిరోజుల తర్వాత నా ఫోన్‌ను యజమాని లాగేసుకున్నారని వివరించాడు. తనను స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపాడు. నామ్‌దేవ్‌ను స్వదేశానికి తిరిగి రప్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకుందని కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి తెలిపారు.

కాలుష్యం నియంత్రించాలి


సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు

భైంసా: భూకాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. పర్యావరణ పరిరక్షణ, శాస్త్రసాంకేతిక దృక్పథంపై మంగళవారం వర్సిటీలో సదస్సు నిర్వహించారు. బయోసైన్స్ అండ్ బయో ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆర్థిక సహకారంతో వికసిత్ భారత్ కోసం ఈ సదస్సు నిర్వహించినట్లు వెంకటరమణ తెలిపారు. స్వదేశీ సాంకేతికత 2047 అనే లక్ష్యంతో పర్యావరణ పరిరక్షణ శాస్త్రసాంకేతిక దృక్పథం అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రపంచానికే ఒక సవాల్‌గా మారిందని తెలిపారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, డిజిటల్ మీడియా రాకతో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, సమన్వయకర్త డాక్టర్ రాకేశ్‌రెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ పావని, హెచ్‌వోడీలు డాక్టర్ దేవరాజు, డాక్టర్ సాయికృష్ణ, సురేశ్, కోఆర్డినేటర్ డాక్టర్ కాశన్న, అధ్యాపకులు మధుసూదన్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి కేసులో మరొకరు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్‌లో గతనెల 23న అర్ధరాత్రి జరిగిన దాడి కేసులో మరొకరిని అరెస్టు చేసినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. మంచిర్యాల పోలీసుస్టేషన్‌లో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావు వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేసే ఆత్మకూరి సంజీవ్‌పై గతనెల 23న అర్ధరాత్రి మంచిర్యాలకు చెందిన గడప రాకేశ్, విశాల్ సూచన మేరకు రుద్రతేజ, జ్ఞానేశ్వర్‌తో కలిసి కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు. రాకేశ్‌తోపాటు 18 మందిపై కేసు నమోదు చేసి 9 మంది అరెస్టు చేయగా మంగళవారం మందమర్రి మండలం బొక్కలగుట్టకు చెందిన పంగ శ్రీధర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అతని వద్ద నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగతావారిని త్వరలో అరెస్టు చేసి పీడీ యాక్ట్ నమోదు చేస్తామని పేర్కొన్నారు.

వర్షాలతో ఉత్పత్తి సాధనలో వెనుకంజ

- ఇప్పటికి 71 శాతం లక్ష్యసాధన
- జీఎం బి.సంజీవరెడ్డి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిందని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 నాటికి శ్రీరాంపూర్ ఏరియా ఉత్పత్తి లక్ష్యం 29.68 లక్షల టన్నులకు గాను ఇందులో 21.13 లక్షల టన్నులు సాధించి 71 శాతం లక్ష్యాన్ని నమోదు చేసుకుందన్నారు. సెప్టెంబర్‌లో 61 శాతం ఉత్పత్తి నమోదైందని తెలిపారు. ఈ సీజన్‌లో ఎన్నడూ లేనంతగా 120 రోజులు వర్షం వల్ల ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి తీయలేకపోయామన్నారు. అదే విధంగా శ్రీరాంపూర్‌లో ఇటీవల కొత్తగా 29 ఎస్‌డీఎల్ యంత్రాలు కొనుగోలు చేశామన్నారు. ఆర్కే న్యూటెక్ గనిలో కొత్త పని స్థలాలు గుర్తించి వాటికి అనుమతి తీసుకోవడంతో గని జీవిత కాలం మరో రెండేళ్లు పెరిగిందన్నారు. ఎస్సార్పీ 3 గనిలో ఇలాంటి చర్యలు చేపట్టామన్నారు. చెన్నూరులో మూతపడ్డ భూగర్భ గనుల స్థానంలో ఓసీపీలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కాలనీలకు పరిశుద్ధమైన నీటిని అందించానికి రూ.16 కోట్లతో ఆర్‌జీఎఫ్ ఫిల్టర్‌బెడ్‌ను సీసీసీలో ఏర్పాటు చేస్తున్నామని, మరో రూ. 6 కోట్లతో తాగునీటి పైప్‌లైన్‌ను గోదావరి నుంచి ఇక్కడికి వేయిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎస్ఓటూ జీఎం సత్యనారాయణ, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, పీఎం రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజాభవన్‌కు తరలిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు


ప్రజాభవన్ వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు తరలివెళ్లారు. ఖానాపూర్ డివిజన్‌లోని అటవీశాఖలో పనిచేస్తున్న బేస్‌క్యాంప్ వాచర్లతోపాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, యానిమల్ ట్రాకర్లు, తదితరులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కనీసవేతనం అమలు చేసి రెగ్యులర్ చేయాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజాభవన్ ఇన్‌చార్జి ఐఏఎస్ అధికారి దివ్యదేవరాజన్‌తోపాటు సీఎం సలహాదారు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాంలను కలిసి సమస్యలను విన్నవించినట్లు తెలిపారు. స్వామి, ఉపేందర్, సంజీవ్, మధుకర్, రమేష్, నందు, రాజేష్, సాయి, రవి, మోహన్, తదితరులు ఉన్నారు.

బాసర ఈవో, ఏఈవోపై ఫిర్యాదు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ఈవో, ఏఈవో అవినీతికి పాల్పడ్డారని వీరిపై వెంటనే విచారణ చేపట్టాలని రాష్ట్ర విజిలెన్స్ అధికారికి మాజీ జెడ్పీటీసీ వసంతా రమేశ్, మాజీ సర్పంచ్ రమేశ్ మంగళవారం ఫిర్యాదు చేశారు. 100 రూముల అద్దె గదుల పనుల నిర్మాణ పనులను నాసిరకంగా చేపడుతూ కోట్ల రూపాయలను దుర్వినియోగం చేశారని విన్నవించారు. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కైన ఈవో, ఏవోలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

మతమార్పిడికి యత్నించిన ఇద్దరికి ఒకరోజు జైలు

కడెం: మతమార్పిడికి యత్నించిన ఇద్దరికి ఒకరోజు జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ ఖానాపూర్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు కానిస్టేబుల్ నర్సింహా కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అసాని కరుణాకర్, మల్లేపల్లి గంగారాంలు తనను క్రిస్టియన్ మతమార్పిడి కావాలని యత్నించారని దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన నవీన్‌శర్మ 2015లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. ఖానాపూర్ కోర్టులో పీపీ నలుగురు సాక్షులను హాజరపర్చగా నేరం రుజువు కావడంతో మెజిస్ట్రేట్ ఈ మేరకు తీర్పుచెప్పారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

కాసిపేట: రాష్ట్రస్థాయి అండర్–14 ఫుట్‌బాల్ ఎంపిక పోటీలకు కాసిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థి బానోతు విష్ణు ఎంపికయ్యాడు. మందమర్రి మండలం బొక్కలగుట్టలోని హేవన్ ఆఫ్ హోప్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్–14 విభాగంలో జిల్లాస్థాయి పోటీల్లో బానోతు విష్ణు ప్రతిభకనబర్చి ఎంపికైనట్లు హెచ్ఎం సాంబమూర్తి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూపలు ఈ సందర్భంగా విష్ణుతోపాటు పీఈటీ రాజన్నను అభినందించారు.

విద్యుదాఘతంతో ఇల్లు దగ్ధం


కాలిపోయిన సామగ్రితో బాధితురాలు, అధికారులు

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామంలో డోంకేశ్వరం నర్సవ్వకు చెందిన ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సవ్వ కుటుంబ సభ్యులు ఎప్పటిలాగా మంగళవారం వ్యవసాయ, వివిధ పనులను నిమిత్తం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటి నుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి భైంసా అగ్నిమాపక సిబ్బందిని సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. అప్పటికే టీవీ, కూలర్, వాషింగ్‌మిషిన్, ఫ్రిజ్, సర్టిఫికెట్లతోపాటు రూ.1.80 లక్షల నగదు కాలిపోయాయి. సుమారు రూ.6.50 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు తెలిపింది. ఆర్ఐ బాలకిషన్, ఆర్.లలిత సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.

రాష్ట్రస్థాయి కుస్తీపోటీలకు ఎంపిక


హెచ్ఎం, పీడీతో విద్యార్థినులు

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కుస్తీపోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం పి.ఉమాదేవి, పీడీ సాంబమూర్తి తెలిపారు. లక్సెట్టిపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో సోమవారం ఉమ్మడి జిల్లా జోనల్‌స్థాయి కుస్తీ పోటీలు జరిగాయి. అండర్–17 విభాగంలో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని సీహెచ్ హర్షిత, కె.శ్రీవల్లి గోల్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. అండర్–14 విభాగంలో జరిగిన పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని ఈ.ఈశ్వరి గోల్డ్ మెడల్ గెలుచుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటలో ఈనెల 3నుంచి 5వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు. వీరిని హెచ్ఎం, పీడీ అభినందించారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు


విధులకు హాజరైన ఏఈవోలు

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలపై పనిభారం మోపడాన్ని నిరసనగా భీంపూర్ మండలానికి చెందిన ఏఈవోలు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఈవో వెంకటేశ్ మాట్లాడుతూ రైతుభరోసా, రుణమాఫీ, రైతులకు సూచనలు, క్రాప్‌బుకింగ్ పనుల్లో తాము నిమగ్నమై ఉన్నామని తెలిపారు. మరోవైపు ప్రభుత్వం పంట చేలకు వెళ్లి డిజిటల్ సర్వే చేయమనడంతో మరింత పనిభారం పడుతుందన్నారు. ఏఈవోలకు వెంటనే పనిభారం తగ్గించాలని కోరారు. ప్రతీ క్లస్టర్‌కి ఒక వ్యవసాయ సహాయకులను నియమించాలన్నారు. అర్లి, నిపాని, ధనోర క్లస్టర్ ఏఈవోలు శంకర్, సాయి ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

ఆసిఫాబాద్/కౌటాల: హత్యాయత్నం కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి యువరాజ మంగళవారం తీర్పు చెప్పారు. కౌటాల సీఐ ఎం.రమేశ్ కథనం ప్రకారం.. గతేడాది ఆగస్టు 8న కౌటాల మండలం గుండాయిపేటకు చెందిన ఎలుములె సాయిరాం అదే గ్రామానికి చెందిన ఒక అమ్మాయిని ప్రేమ పేరుతో వేధించాడు. విషయం తెలుసుకున్న నాగపురి శంకర్, పంకజ్, సందీప్ సోదరులు సాయిరాంను కొట్టి ఓ బావిలో పడేశారు. ఈత రావడంతో బావి నుంచి బయటకు వచ్చి జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పాడు. తండ్రి ఎల్ములే గణపతి ఫిర్యాదుతో ఎస్సై మధుకర్ కేసు దర్యాప్తు చేశారు. పీపీ ప్రసాద్ సాక్షులను కోర్టులో హాజరుపర్చగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన సీఐ, ఎస్సైలను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


కాజల్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని హస్నాపూర్ (మారుగూడ)కు చెందిన వివాహిత కాజల్ (25) మహారాష్ట్రకు చెందిన కిరణ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 15 నెలల పాప ఉంది. తరచూ భార్యభర్తల గొడవలు జరుగుతుండేవి. ఏడాది క్రితం ఆమె పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంది. పాప భవిష్యత్తుపై మదనపడేది. ఈక్రమంలో కాజల్ మనస్తాపం చెంది జీవితంపై విరక్తితో మంగళవారం తెల్లవారుజాము ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి నివర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మహిళ ఆచూకీ లభ్యం

వేమనపల్లి: వారం క్రితం అదృశ్యమైన బుయ్యారం గ్రామానికి చెందిన జెడ లక్ష్మి ఆచూకీ లభ్యమైంది. వివరాలు ఇలా ఉన్నాయి..గతనెల 24న ఇంటి నుంచి వెళ్లిన ఆమె బెల్లంపల్లి నుంచి కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు చేరింది. మానసిక వికలాంగురాలైన ఆమెను రైల్వే పోలీసులు అదుపులో తీసుకున్నారు. వారం రోజులు ఆమెకు అన్నపానీయాలు అందజేశారు. కాగా, ఆమె ఆచూకీ దొరకకపోవడంతో భర్త రాజలింగు, కుటుంబీకులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ గురించి నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్, కుటుంబ సభ్యులకు కాగజ్‌నగర్ ఆర్పీఎఫ్ పోలీసులు సమాచారం ఇచ్చారు. మంగళవారం కాగజ్‌నగర్ వెళ్లి ఆమెను కుటుంబీకులు, కానిస్టేబుల్ లక్ష్మణ్ ఇంటికి తీసుకువచ్చారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

సోన్: మండలకేంద్రానికి చెందిన వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు మంగళవారం చోరీకి గురైంది. ఏఎస్సై భూమేశ్వర్ కథనం ప్రకారం..సముందర్‌పెల్లి లస్మబాయ్(90) మధ్యాహ్నం తన ఇంటి ముందు మంచం వేసుకుని కూర్చుంది. ఆ సమయంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి వచ్చి వృద్ధురాలితో మాట్లాడి ఆమె మెడలో బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. దీని విలువ రూ.25 వేలు ఉంటుంది. బాధితురాలి మనవడు దాసరి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

దూదిగాంలో..

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం దూదిగాం వద్ద ఓ మహిళ మెడలో రెండు తులాల బంగారు చైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. చేశారు. ఎస్సై నారాయణ కథనం ప్రకారం..నిర్మల్ జిల్లా గొల్లపేట్‌కు చెందిన నంద స్వప్న తన కుమారుడిని దూదిగాంలో ఉన్న సీఎస్ఐ హాస్టల్ నుంచి దసరా సెలవుల కోసం ఇంటికి తీసుకెళ్లేందుకు మంగళవారం వచ్చింది. ఈ క్రమంలో జాతీయ రహదారి 44 రోడ్డును క్రాస్ చేసేందుకు నిర్మించిన వంతెన కిందకు రాగానే వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కెళ్లారు. దుండగులు ఆర్మూర్ వైపు వెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.